ఫరీదుపేట సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని ఫరీదుపేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. 2022లో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేసినా మండల స్థాయి అధికారులు అమలు చేయకపోవడంతో టిడిపి నాయకుడు కొత్తకోట అమ్మినాయుడు 'మీకోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రెండేళ్ల పాటు ఆదేశాలు అమలు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం దుకాణాలు మావే...

- లాటరీలో దక్కితే ఓకే
- వేరే వ్యక్తులు చేజిక్కించుకుంటే వాటాలు ఇవ్వాల్సిందే...
- దుకాణాలన్నీ తమ గుప్పిట్లో ఉండేలా టిడిపి నాయకుల వ్యూహం
- ఇప్పటివరకు 2067 దరఖాస్తులు
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయివేట్ మద్యం వ్యాపారంపై టిడిపి నాయకులు గట్టి పట్టు బిగిస్తున్నారు. జిల్లాలోని అన్ని దుకాణాలు తమ గుప్పిట్లో ఉండేలా వ్యూహం రచిస్తున్నారు. జిల్లాలో చాలాచోట్ల టిడిపి నాయకులే సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేస్తున్నారు. వారితోపాటు వైసిపి నాయకులూ దరఖాస్తు చేసుకుంటున్నారు. లాటరీలో తమకు వాటాలు దక్కితే సరే, వేరే వ్యక్తులు చేజిక్కించుకుంటే మాత్రం అందులో వాటాలు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. దరఖాస్తులు వేయనీయకుండా చేస్తే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు వస్తుందనే ఆలోచనతో దుకాణాల కేటాయింపు వరకు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ప్రత్యేక వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఒకట్రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్నింటిలో టిడిపి ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రైవేట్‌కు మద్యం వ్యాపారం అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అధికారులు ఈనెల ఒకటో తేదీన 158 దుకాణాలకు గెజిట్ నోటిఫికేషన్ వెలువరించారు. ఇప్పటివరకు 2067 దరఖాస్తులు వచ్చాయి. మద్యాన్ని ప్రభుత్వం ప్రయివేట్‌కు అప్పగిస్తుందన్న అంచనాలతో టిడిపి నాయకులు ముందుచూపుతో వ్యవహరించి గ్రామాల్లో డబ్బులు సేకరించే పని నెల రోజుల కిందటే మొదలుపెట్టారు. పార్టీ మండల నాయకులు గ్రామాల్లో చర్చించి తమ అనుయాయులను భాగస్వాములను చేసేందుకు వారి నుంచి వాటా డబ్బులను సేకరించారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మండలంలోని అన్ని దుకాణాలకూ దరఖాస్తులు వేశారు. కొంతమంది పక్క మండలాల్లో సైతం దరఖాస్తు చేశారు. కొన్నిచోట్ల టిడిపి నాయకులతో బిజెపి, జనసేన నాయకులూ కలిశారు. మరికొన్ని ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో తమకు ఇసుక తవ్వకాల్లో వాటాలు కల్పించడంతో పాటు వారితో స్నేహం నెరిపిన వైసిపి నాయకులకూ వాటాల్లో భాగస్వామ్యం కల్పించారు. టిడిపి, వైసిపి నాయకులకు పొసగని చోట మాత్రం వేర్వేరుగా రెండు పార్టీల నాయకులు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తులు సమర్పించే విషయంలో టిడిపి నాయకులు ఎటువంటి అభ్యంతరం చెప్పడం లేదని తెలుస్తోంది. లాటరీ విషయం తేలిన తర్వాత వైసిపి నాయకుల సంగతి చూద్దాం అన్నట్లుగా అంతా వేచి చూస్తున్నారు. టిడిపి నాయకులు, వారి ఆశీస్సులు ఉన్న వారికి దుకాణాలు దక్కితే తమ పని తాము చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాకాకుండా వైసిపి, ఇతరులకు దుకాణాలు వస్తే మాత్రం వాటాలు అడుగుతామనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాలు మినహా అన్ని నియోజకవర్గాల్లో టిడిపి ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాలకు ఈనెల ఒకటో తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇప్పటివరకు 158 దుకాణాలకు 2067 అప్లికేషన్లు వచ్చాయి. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 దుకాణాలకు 150 దరఖాస్తులు చేరాయి. పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలకు కేటాయించిన 13 షాపులకు 125 దరఖాస్తులు వచ్చాయి.

30 మండలాలకు కేటాయించిన 131 దుకాణాలకు 1792 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ స్టేషన్ల వారీగా పరిశీలిస్తే శ్రీకాకుళం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 32 దుకాణాలకు అత్యధికంగా 529 దరఖాస్తులు వచ్చాయి. ఆమదాలవలసలోని 13 షాపులకు 191 దరఖాస్తులు చేరాయి. రణస్థలం స్టేషన్ పరిధిలో 15 దుకాణాలు కేటాయించగా 376 దరఖాస్తులు వచ్చాయి. పొందూరులో పది దుకాణాలకు 175 దరఖాస్తులు, నరసన్నపేటలో 12 దుకాణాలకు 70 దరఖాస్తులు చేరాయి. కొత్తూరులో ఏడింటికి 114 దరఖాస్తులు, పాతపట్నంలోని ఎనిమిది దుకాణాలకు 93, కోటబొమ్మాళిలోని 15 దుకాణాలకు 91 దరఖాస్తులు వచ్చాయి. సోంపేటలో 12 షాపులకు 142, ఇచ్ఛాపురంలోని ఎనిమిది దుకాణాలకు 136 దరఖాస్తులు చేరాయి. టెక్కలిలోని 11 దుకాణాలకు 63, నరసన్నపేటలోని 12 షాపులకు 142 దరఖాస్తులు వచ్చాయి.

ఒక్కోచోట ఒక్కోలా...

టెక్కలి నియోజకవర్గంలో ఓ అమాత్యుని సోదరుడి హవా నడుస్తున్నట్లు చర్చ నడుస్తోంది. అన్ని దుకాణాలకూ టిడిపి నాయకులే దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. పాతపట్నం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు టిడిపిలోని రెండు గ్రూపులూ పోటాపోటీగా దరఖాస్తులు చేస్తున్నాయి. దుకాణాలు దక్కితే తనకు వాటా ఇవ్వాల్సిందేనంటూ పలువురు వ్యాపారులతో టిడిపికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అన్నట్లు ప్రచారం సాగుతోంది. నరసన్నపేటలో నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి తనయుడే అన్నీ చక్కబెడుతున్నట్లు తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎవరు దరఖాస్తులు పెట్టాలో సూచిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. పలాస నియోజకవర్గంలో పాత కథే పునరావృతమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి భర్త చెప్పినట్లే దరఖాస్తుల ప్రక్రియ సాగినట్లు తెలుస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లో దరఖాస్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో పాటు ఒడిశాలోని బినామీ వ్యాపారులకూ అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం.

మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పాలస్తీనాకు అండగా నిలుద్దాం

శ్రీకాకుళం నగరంలో శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అమెరికా మద్దతుతో చెలరేగిపోతున్న ఇజ్రాయిల్ దుర్మార్గాలను ఖండిస్తూ, పాలస్తీనాకు ప్రజలంతా అండగా నిలవాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘ జిల్లా కన్వీనర్ బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. పాలస్తీనాకు సంఘీభావంగా నగరంలోని సూర్యమహల్ కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వరకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యాన మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలని, పశ్చిమాసియా దేశాల్లో శాంతి నెలకొల్పి పాలస్తీనా భూభాగాన్ని వారికి అప్పగించాలన్నారు. ఇజ్రాయిల్ దుర్మార్గాలకు అంతు లేకుండా పోతోందన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేసి మారణహోమం సృష్టించి ఏడాదైనా, అక్కడ శాంతి నెలకొల్పాలని ఐక్యరాజ్య సమితి ఆదేశించినా అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చెలరేగిపోతోందని విమర్శించారు. గాజాలో దండయాత్ర చేసి 42వేల మంది పాలస్తీనా ప్రజలను ఊచకోత కోసిందని, మృతుల్లో 26 వేల మంది పసి పిల్లలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెతన్యాహు ప్రభుత్వం ఇప్పుడు లెబనాన్‌పై భూతల దాడులకు తెగబడి ఆ దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తోందన్నారు. ఇరాన్‌పై డ్రోన్ దాడి చేసి హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియేను హత్య చేసిందన్నారు. వేలాది పేజర్లు ఎలక్ట్రానిక్ పరికరాల పేల్చి వందలాది మంది లెబనాన్ ప్రజల మృతికి ఇజ్రాయిల్ కారణమైందన్నారు.

ఐక్యరాజ్యసమితి ఈ యుద్ధానికి ముగింపు పలకాలని తీర్మానం పెడితే అమెరికా అడ్డుకుందని గుర్తుచేశారు. ఈ ఓటింగ్‌లో భారతదేశం గైర్హాజరైందన్నారు. పాలస్తీనా అనుకూల విధానం నుంచి మోడీ ప్రభుత్వం వైదొలుగుతోందని విమర్శించారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాలను మందుగుండు సామగ్రిని మోడీ ప్రభుత్వం ఎగుమతి చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ వైఖరిని విడనాడి పాలస్తీనా స్వతంత్ర పోరాటానికి మద్దతు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.నాగమణి, ఆర్.స్వప్న, మెహబూబాఖాన్, షాను, వి.జి.కె మూర్తి, చంద్రశేఖర్, ఆర్.ప్రకాశరావు, పి.సుధాకరరావు, కె.సూరయ్య, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, పి.తేజేశ్వరరావు, కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

జిల్లాస్థాయి అండర్-15 విభాగంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలను శ్రీకాకుళం నగరంలో ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బగాది కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పోటీలకు హాజరు కావాలని తెలిపారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9912559735 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రేపు 'మన పలాస - మన బాధ్యత'

ప్రజాశక్తి - పలాస

మన పలాస - మన బాధ్యత అనే కార్యక్రమాన్ని ఈనెల పదో తేదీన ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు చేపడుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో 250 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బి రోడ్డు ఉందని, ఆ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జిఒలు, వెలుగు సిబ్బందితో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ఎన్‌ఆర్‌ఇజిఎస్, సచివాలయ సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ముందుకొస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే 50 కిలోమీటర్ల మేర యంత్రాలతో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు కొంతమంది ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం కోసం ఎవరి వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయడం లేదని, పలు వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రజలూ తమవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఎస్.నవీన్ కుమార్, గురిటి సూర్యనారాయణ, జనసేన నాయకులు సంతోష్ కుమార్, బిజెపి నాయకులు వైశ్యరాజు మోహన్‌రాజు, పాలవలస వైకుంఠరావు, ఆర్ అండ్ బి డిఇ ఎస్.రామానాయుడు, జెఇ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పొందూరు, జి.సిగడాం

రైతులు వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పొందూరు మండలంలోని కనిమెట్ట, జి.సిగడాం మండలంలోని సంతవురిటిలో మంగళవారం నిర్వహించిన ఈ-పంట నమోదు, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదు చేసిన రైతు పేరు, సర్వే నంబరు విస్తీర్ణం రైతు యొక్క మొబైల్ నంబరు, పంట రకం పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం కాలువ ద్వారా అవసరమైన సాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటూ కనిమెట్టలో పలువురు రైతులు, మడ్డువలస కాలువ నుంచి 39 ఎల్ వద్ద గల నీరు పారే దోని పాడవడంతో సాగునీరందక అవస్థలు పడుతున్నామని సంతవురిటి రైతులు జెసి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు అవసరమైన సాగునీటిని వెంటనే సరఫరా చేయాలంటూ ఆదేశించారు. అనంతరం జి.సిగడాం మండలంలోని పాలఖండ్యాంలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. డీలర్లు అధిక ధరలకు ఎరువుల విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి, ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒలు బెండి బాబ్జీ, శారద, జి.సిగడాం తహశీల్దార్లు శ్రీకాంత్, వెంకటేష్, హెచ్ఇఒ నీరజ, మాజీ ఎంపిపి బాలబొమ్మ వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచ్ చందనాల గణపతిరావు, సచివాలయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : రైతుల వివరాలను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నీటిసంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భారీ, మధ్య, చిన్న నీటిపారుదల ప్రాజెక్టుల వారీగా సాగునీటి సంఘాలకు వచ్చే నెల నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని చెప్పారు. అందుకు తగ్గ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. వంద రోజుల ప్రణాళికా సమావేశంలో భాగంగా ప్రతి వారం జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మంగళవారం మాట్లాడారు. ప్రాజెక్టుల పరిధి ఆధారంగా ఓటర్ల జాబితాను సవరించాలని సూచించారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. అన్ని శాఖలు కోర్టు కేసుల విషయమై తక్షణమే స్పందించాలన్నారు. నాలా దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టరాదని ఆర్‌డిఒలను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఈనెల 14 నుంచి నిర్వహించే పల్లె పండగ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించాలని సూచించారు. మన ఇళ్లు-మన గౌరవం హౌసింగ్ కార్యక్రమం ప్రగతిలో వెనుకబడిన వారు పనితీరు మెరుగుపరచుకోవాలని హెచ్చరించారు. మూడు మలేరియా కేసులు నమోదైన ఎచ్చెర్ల మండలంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి కేసులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, నీటిపారుదల శాఖ ఎస్ఇ పి.సుధాకర్, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ సహ పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

14 నుంచి పల్లె పండుగ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు పల్లె పండుగ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో పల్లె పండుగ కార్యక్రమాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో సన్నద్ధతపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 3071 పనులను గుర్తించి, వాటికి సంబంధించి రూ.249 కోట్ల అంచనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 2,714 పనులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చామని, వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని వివరించారు. మిగిలిన వాటిని రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఆయా పనులకు ఎలాంటి ఇసుక కొరత లేదని, సిమెంట్‌కి సంబంధించి డీలర్లతో మాట్లాడుతున్నామని మంత్రికి వివరించారు. గ్రామసభల తీర్మానాలు పూర్తయి అనుమతులు పొందిన పనులకు 14 నుంచి వారం రోజుల వ్యవధిలో శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ బి.సుధాకర్, జిల్లాపరిషత్ సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజా, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'పిఎం సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పొందూరు

సోలార్‌తో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ పొందవచ్చని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. పొందూరు విద్యుత్ ఉపకేంద్రంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న సోలార్ విద్యుత్‌ను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులు మొబైల్‌లో పిఎం సూర్య ఘర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్ ద్వారా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు తమ అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించుకోవచ్చన్నారు. భవిష్యత్‌లో సోలార్ విద్యుత్ వినియోగం బాగా పెరగనుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఇఇలు పి.యోగేశ్వరరావు, జి.సురేష్‌కుమార్, డిప్యూటీ ఇఇ యు.వి రమణమూర్తి, ఎఇ డి.రమణమూర్తి, విద్యుత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్‌సంగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం శ్రీపెరంబదూరులో దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా సిఐటియు ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో సామ్‌సంగ్ మొబైల్స్ షాప్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1926 ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం సామ్‌సంగ్ పరిశ్రమలో పనిచేస్తున్న 1800 మంది కార్మికులు చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకుని సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరినా పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్మికులు ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ని గుర్తించాలని, వేతనాలు పెంచాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని యాజమాన్యాన్ని కోరినా పట్టించుకోకపోవడంతో 1450 మంది కార్మికులు అనివార్యంగా ఈనెల తొమ్మిదో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని చెప్పారు. సామ్‌సంగ్ పరిశ్రమలో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు తయారు చేసే నైపుణ్యం గల కార్మికులకు వేతనాలు పెంచాలని కార్మికుల కోరిన న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తక్షణమే తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ యాజమాన్యాలు కార్మిక చట్టాలు కాలరాస్తుంటే అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న సామ్‌సంగ్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సామ్‌సంగ్ యాజమాన్యం పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సామ్‌సంగ్ కార్మికులు ఒంటరిగా లేరని, దేశవ్యాప్తంగా కార్మికులంతా వారికి అండగా ఉన్నారని ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎ.సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు, నాగార్జున అగ్రికమ్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎల్.రామప్పడు, ఎం.రమణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - బూర్జ, శ్రీకాకుళం

అసాంఘిక కార్యకలాపాల నిర్వహణకు ఎటువంటి అవకాశం లేకుండా నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. బూర్జ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ప్రాపర్టీ భద్రపరిచే గదులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పలు ముఖ్యమైన రికార్డుల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే మహిళలు, వృద్ధులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలని పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో సందర్శించి గ్రామాల పరిస్థితులపై గ్రామస్తులతో మాట్లాడాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఎస్‌పిని కలిసిన ఆర్‌డిఒలు

శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి ఎస్‌పి మహేశ్వర రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. గ్రూప్-1లో మంచి ఉత్తీర్ణత సాధించి ఆర్‌డిఒలుగా ఎంపికైనందుకు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో మొదటిసారిగా ఆర్‌డిఒలుగా నియమితులైన ఇరువురూ ప్రజలకు రెవెన్యూపరమైన మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం పరిపాలన, తదితర అంశాలపై కాసేపు మాట్లాడారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థికసాయం

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఎస్.తారకేశ్వరరావును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి చేతుల మీదుగా దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందించి ప్రశంసాపత్రం అందజేశారు. తక్షణ ఆర్థిక చేయూతగా రూ.ఐదు వేల నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి సిహెచ్.గోపీనాథ్, ఆర్ఎస్ఐ రమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జాబ్‌మేళాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యాన కూటమి ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తుందని, విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్ ఉండాలని సూచించారు. ప్రభుత్వం యువతలో నైపుణ్యాల పెంపొందించేందుకు జిల్లాల్లో 8 నైపుణ్య అభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. అనంతరం ప్రముఖ కంపెనీలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరికి సాయి కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భూ సమస్యలను పరిష్కరించాలి

కొత్తూరు: భూముల రీసర్వేలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, భూ యజమానులకు న్యాయం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కె.రవిచంద్రను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు రీసర్వేలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని రైతాంగం సమస్యలను పరిష్కరించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘ నాయకులు పెద్దకోట యతిరాజు, గేదెల కృష్ణారావు, సురేష్‌నాయుడు, చలపతిరావు, కె.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

'ఆధార్' లేని గిరిజనుడు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

'ఆధార్'కు నోచుకోని లచ్చయ్య

ఆ గిరిజన వృద్ధికి డెబ్బై ఏళ్లు అయినా ఇప్పటికీ ఆధార్ లేదంటే విడ్డూరమే. ఒంటరిగా జీవిస్తున్న పెంగువాడకు చెందిన గొడ్డూరు లచ్చయ్యకు ఆధార్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు ఆధారం లేకుండాపోయింది. చివరికి బిక్షాటన చేసుకునే దుస్థితి కలిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తున్నారే తప్ప వృద్ధిని దయనియా స్థితిపై జాలి లేకుండాపోయింది. లచ్చయ్యకు గ్రామంలో జీవనాధారం లేక మెళియాపుట్టి మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

కుక్కల స్వైరవిహారం

స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

టెక్కలి రూరల్: టెక్కలిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధాన కూడళ్లతో పాటు పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తున్న వ్యక్తులతో పాటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులపైనా దాడులు చేస్తున్నాయని అంటున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో రాజకీయ జోక్యం తగదు

సిడిపిఒలకు వినతిపత్రాలు అందజేత

శ్రీకాకుళం అర్బన్ : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో రాజకీయ పార్టీల జోక్యం లేకుండా చూడాలని, అలాగే అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకొచ్చిన యాప్‌ల భారాన్ని తగ్గించి ఒకే యాప్‌గా మార్చడంతో పాటు రికార్డు వర్క్ తగ్గించాలని అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, నాయకులు జి.రాజేశ్వరి, కె.జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిఒ శోభారాణిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోషణ వేడుకలకు సంబంధించి 2022 నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేసేందుకు కృషి చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని రికార్డు వర్క్‌ను తగ్గించాలన్నారు. ఏడు నెలల వయసు గల పిల్లల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. అంగన్వాడీలకు ప్రభుత్వం రికార్డులను ఇవ్వకుండా ఐదు రకాల రికార్డులను రాయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. దీంతో ఒక్కో అంగన్వాడీ కార్యకర్త రూ.వెయ్యి నుంచి రూ.12 వందల వరకు ఖర్చు చేసి రికార్డులను కొనుగోలు చేసి రాయడంతో ఆర్థికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లు సక్రమంగా పనిచేయడం లేదని, కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ లేనందువల్ల యాప్‌ల్లో లబ్ధిదారులు వివరాలను నమోదు చేయడానికి ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. పిల్లలకు ఫొటోలు తీయాలనే నిబంధన తొలగించాలని ఫ్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలన్నారు. సిడిపిఒను కలసిన వారిలో జి.లత, వై.రత్నకుమారి పాల్గొన్నారు.

ఆమదాలవలస : అంగన్వాడీలపై పని భారం తగ్గించాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి, పి.లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ ఎస్.అనురాధను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.లక్ష్మి డి. అరుణ, సుమతి పాల్గొన్నారు.

కొత్తూరు: అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు తీసుకొచ్చిన యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, కె.రజని, ఎస్.నిర్మల డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తూరు ఐసిడిఎస్ కొత్తూరు ప్రాజెక్టు అధికారి విమలకుమారిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రీస్కూల్‌ను బలోపేతం చేయాలని అన్నారు. కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విన్నవించారు.

కొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

నాట్యప్రదర్శనకు సిద్ధమవుతున్న కళాకారులు

తిరుమల బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి దేవస్థానం సన్నిధిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న శుభ తరుణంలో ఈ నెల 10న వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు నాట్య ప్రదర్శనకు చక్కటి అవకాశం లభించింది. ఎందరో పెద్ద పెద్ద కళాకారులు చేస్తున్నా మహతి ఆడిటోరియంలో పదవ తేదీ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు నాట్యప్రదర్శన జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత నాట్యచార్య ఏలేశ్వరం శ్రీనివాసులు ఆధ్వర్యాన ఈ సువర్ణ అవకాశం లభించిందని అకడమి చైర్మన్ వెంకటేశ్వర పట్నాయక్ తెలిపారు. శిష్యులు శృతి పట్నాయక్, దట్టి కావ్య, నీలాపు శైలు, శిల్లా పూజ, చాట్ల జయలక్ష్మి, ఆసిపు శ్వేతారాణి, కొరివి జాగృతి, నీలాపు ప్రీతి, బి.నిఖిత, ఎ.దీపిక, బల్లెడ దీక్షిత నాట్యంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఏటా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో అవకాశం కల్పిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కవిటి : మండలంలోని కొత్తపాలెం కెజిబివిలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఇఒ ధనుంజయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్-1, నైట్‌వాచ్ ఉమెన్-1, స్కావెంజర్-1 పోస్టులకు అర్హులైన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రెండేళ్లు, పిహెచ్‌సిఐ అభ్యర్థులకు 52 ఏళ్ల వరకు వయసు సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15లోగా ఎంఇఒ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా పెట్టామని జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలో గంజాయి సాగు, రవాణాపై నిఘా పెంచామన్నారు. అలాగే వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా వైపు తరలిస్తున్న గంజాయి పట్టుబడుతుందన్నారు. తాజాగా ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కుటునిగండకు చెందిన గోపాల్ సింగ్ మంగళవారం ఒడిశా నుంచి కేరళకు గంజాయిని తరలించేందుకు రైల్వేస్టేషన్ వైపు వస్తున్నారని అన్నారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు చేపట్టారని తెలిపారు. తనిఖీల్లో అతని వద్ద 5,310 గ్రాలు గంజాయి కనిపించడంతో వాటిని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. నిందితుడు డిగ్రీ వరకు చదువుకొని ఉపాధి లేకపోవడంతో చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారని అన్నారు. డబ్బులు లేక గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయించుకున్నాడని చెప్పారు. అతని స్నేహితుడు ఇచ్చిన ఫోన్ నంబరుతో కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో నివాసం ఉంటున్న గంజాయి వ్యాపారం చేసే మీహర్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడని పేర్కొన్నారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇచ్చినట్లతే కేజీకి రూ.పది వేలు ఇస్తామని ఆశ చూపడంతో అక్రమంగా తరలించేందుకు సిద్ధమయ్యారని అన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ చిన్నంనాయుడు, పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు, తమ బిడ్డల భవిష్యత్ భరోసాకు బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 287వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం దీక్షలో పాల్గొన్న ఆముదాలపుట్టుగ బెంతు ఒరియాలు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

క్రైమ్ కార్నర్

వీరస్వామి మృతదేహం

వనవిష్ణుపురంలో కొట్లాట

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని మండలం వనవిష్ణుపురంలో పాతకక్షలు పడగ విప్పడంతో ఇరు గ్రూపుల మధ్య మంగళవారం కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలో పాలిన వీరస్వామి (47) మృతి చెందగా, పాలిన రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏటా దసరా ముందు మంగళవారం వారాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం ఉదయం నుంచీ వారాలు నిర్వహించారు. సాయంత్రం ముర్రాటలు ఇచ్చేందుకు వెళ్తుండగా... ఒక్కసారిగా పాతకక్షలు పడగ విప్పడంతో కొట్లాటకు దిగారు. కత్తులతో, కర్రలతో ఇరు గ్రూపులకు చెందిన వారు దాడులు చేసుకున్నారు. రాళ్లు రువ్వుకున్నారు. క్షతగాత్రుడిని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. సమాచారం అందుకున్న నరసన్నపేట సిఐ శ్రీనివాసరావు, పోలాకి ఎస్ఐ రంజిత్ పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకుని పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్‌పి మహేశ్వర రెడ్డి నరసన్నపేటలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడితో మాట్లాడారు.

నేలబావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం సుబ్బారావుపేటకు చెందిన ఇప్పిలి రాము (53) నేల బావిలో పడి మృతి చెందారు. రాము తన పొలంలోని టమాట పంటకు నీరు పెట్టేందుకు మంగళశారం వెళ్లాడు. ఇంతలో నేలబావిలో జారిపడిపోయాడు. సమీపంలోని రైతులు రాము ఎప్పటికీ కనిపించడం లేదని బావిలో చూశారు. అప్పటిఏ మిగతాజీవై కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి బావిలో నుంచి బయటకు తీశారు. మృతుడు మేరకు కుమారుడు లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాయపడిన వృద్ధురాలి దుర్మరణం

నందిగాం : మండలంలోని కోటియాకొండపేటకు చెందిన కుండంగి సంజీవమ్మ (63) సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన బొడ్డు జనార్ధన ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుంది. నందిగామ వైపు వస్తుండగా... మనిగాం కూడలి వద్ద సంజీవమ్మ బైక్ పైనుంచి జారిపడి కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి ఢిల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి- కంచిలి

మణికంఠ (ఫైల్)

మండలంలోని ఎమ్మెస్ పల్లి పంచాయతీ నారాయణబట్టికు చెందిన కోన మణికంఠ (18) అనే డిగ్రీ విద్యార్థి మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మణికంఠ బారువ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 3న గ్రామంలో కొంతమందితో కలిసి భవాని దీక్ష స్వీకరించాడు. స్థానికంగా ఉన్న సన్నిధానంలో భవానీల కోసం టిఫిన్ తయారు చేసేందుకు మంగళవారం పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో పప్పు నానబెట్టిన నీటిని పారవేసేందుకు వెళ్తున్నాడు. డెకరేషన్ కోసం వేసిన విద్యుత్ వైరును చేత్తో తొలగించేందుకు ప్రయత్నించాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వాస్పరికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి తల్లి చిన్నారి, తండ్రి చిరంజీవితో సోదరి ఉన్నారు. ఈ సంఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

స్థల వివాదంలో కొట్లాట

రణస్థలం రూరల్: మండలంలోని కృష్ణాపురంలో 25/6 ప్రభుత్వ భూముల సంబంధించి గొర్లె సత్యం, అదే గ్రామానికి చెందిన నడిపూరు రాము నాయుడుకు మధ్య మంగళవారం జరిగిన వివాదంలో ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసినట్టు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. గ్రామానికి సంబంధించిన సర్వే నంబరు 25/6లో 53 సెంట్లు గొర్లె సత్యంకు పట్టా ఉందన్నారు. ఈ భూమి ప్రజా అవసరాలకు అవసరమని గ్రామస్తులు కొన్నాళ్లుగా పట్టాదారులు సత్యాన్ని దిగనీయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. విషయంపై కలెక్టర్ వద్ద పంచాయితీ నిర్వహించారని అన్నారు. చివరకు గత రెండు రోజుల క్రితం సత్యం ఆ స్థలంలో కొబ్బరి మొక్కలు నాటారని తెలిపారు. వాటిని కొందరు వ్యక్తులు తొలగించడంతో సత్యం కుటుంబ సభ్యులు వాదించారని అన్నారు. దీంతో గ్రామానికి చెందిన నడుపూరు రామినాయుడు, పిన్నింటి త్రినాథరావు, అనసూయ మధ్యలో వివాదం జరిగిందన్నారు. దీంతో పలువురికి గాయాలయ్యాయని అన్నారు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇదే వివాదంలో సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: పలాస నుంచి జీడి పప్పు వ్యాన్ మంగళవారం వెళ్తుంది. మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై వ్యాను ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాసు, కృష్ణలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీస్ సిబ్బంది అంబులెన్స్‌లో క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మాడను సందర్శించిన హైకోర్టు పిపి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని నిమ్మాడకు చెందిన మెండ లక్ష్మీనారాయణ హైకోర్టు పిపిగా ఇటీవల నియమితులయ్యారు. నియమితులై తొలిసారిగా మంగళవారం స్వగ్రామం నిమ్మాడ సందర్శించారు. ముందుగా నిమ్మాడ కూడలి వద్ద ఉన్న కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నిమ్మాడ వెళ్లి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తల్లిదండ్రులు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, అడ్డిసినల్ మాజీ ఎస్‌పి కింజరాపు ప్రభాకర్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, విజయలక్ష్మి, కామేశ్వరరావు, అడ్వకేట్ కింజరాపు అచ్చెన్నాయుడు, పల్లి వాసుదేవరావు, ఎంపిటిసి పట్ట సింహాచలం, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు పాల్గొన్నారు.

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న లక్ష్మీనారాయణ

ట్యూషన్ సెంటర్ సందర్శన

ట్యూషన్ టీచర్లకు వేతనాలు పంపిణీ చేస్తున్న రవీంద్ర

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని దేరసాం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్‌ను జనసేన నాయకుడు దన్నాన రవీంద్ర మంగళవారం సందర్శించారు. సంవత్సరం నుంచి తన సొంత నిధులతో గ్రామంలోని విద్యార్థుల కోసం ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్యూషన్ సెంటర్‌లో పాఠాలు బోధిస్తున్న టీచర్లకు అందించే నెలవారీ వేతనాన్ని ఇచ్చారు. ట్యూషన్‌లోని పిల్లలను కలిసి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ రోజు ట్యూషన్‌కు హాజరై క్రమశిక్షణతో విద్యను నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని పిలుపు నిచ్చారు. ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదువుకుని మీ తల్లిదండ్రుల కళలను నిజం చేయాలన్నారు. అనంతరం టీచర్లకు వేతనాలను అందజేశారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని హెచ్.గోపాలపురంలో దసరా సందర్భంగా బత్తుల మహాలక్ష్మి తన ఇంట్లో మంగళవారం పిండి వంటలు చేసున్నారు. ఈ సమయంలో గ్యాస్ సిలిండర్ నుంచి అగ్ని జ్వాలలు రావడంతో మహాలక్ష్మి సిలండర్‌ను పక్కకు తోసేసింది. దీంతో గ్యాస్ సిలెండర్ పక్కకు తోసేసింది. దీంతో గ్యాస్ సిలిండర్ పేలడంతో వంట గది పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. పెద్ద శబ్ధం రావడంతో స్థానికులు వచ్చి మహాలక్ష్మిను బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం వల్ల ఎవరికీ ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు. సమాచారం అందుకున్న ఆర్ఐ పండిత బాబీ, విఆర్ఒ స్వాతి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద నష్టాన్ని అంచనా వేశారు. ప్రమాదంలో జరిగిన నష్టపరిహార నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ బాబీ

సాంకేతికతతో చేపల పెంపకం

నాబార్డు డిజిఎం రమేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

చేపల పెంపకంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని నాబార్డు డిజిఎం రమేష్ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మత్స్యకారులు, చేపల పెంపకందారులు సంఘటితంగా ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పాటు కావాలన్నారు. వారికి నాబార్డు ద్వారా అమలవుతున్న పథకాలు అందిపుచ్చుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే చేపల పెంపకం ద్వారా వచ్చిన చేపలను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కూడా ఏర్పడుతుందని అన్నారు. కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని సాగువిధానాలను అవలంబించినట్లయితే రైతుకు ఆదాయం రెట్టింపు అవుతుందని అన్నారు. అలాగే అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులను గుర్తించడం వాటిని సకాలంలో యాజమాన్య చర్యలు పాటించడం ద్వారా నష్టాలను నివారించుకోవచ్చని అన్నారు. కమ్యూనిటీ, పంచాయతీ చెరువుల్లో మంచి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులు రెట్టింపు చేసుకోవడానికి అవకాశం ఉందని సాగులో మెలకువలను వివరించారు. అనంతరం కార్పు చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అనే పుస్తకాన్ని విడుదల విడుదల చేశారు. అలాగే ప్రశంసాపత్రాలను అందజేశారు.

మాట్లాడుతున్న నాబార్డు డిజిఎం రమేష్

కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజారావు

ప్రజాశక్తి- పొందూరు

రాజారావు

కళావేదిక జిల్లా విభాగం ప్రధాన కార్యదర్శిగా పొందూరుకు చెందిన సీనియర్ రచయిత వావిలపల్లి రాజారావు మాస్టారు వరుసగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయనకు ఈ బాధ్యత దక్కింది. ఈ సందర్భంగా రచయిత రాజారావును జెడ్‌పి పూర్వ సిఇఒ, కళా వేదిక గౌరవాధ్యక్షులు సురంగి మోహనరావు, అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, ఉత్తరాంధ్ర విభాగం అధ్యక్షులు మహమ్మద్ రఫీ (ఈవేమన) అభినందించారు.

పోస్టల్‌లో ఆధార్ అప్‌డేట్

టెక్కలి రూరల్ : డివిజన్ కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో నేషనల్ పోస్టల్ వీక్-2024 సందర్భంగా ఈ నెల 10న ఉదయం 8 గంటల నుంచి ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు హెడ్ పోస్టమాష్టర్ ఎన్.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవడం, కార్డుకు ఫోన్ నంబరు లింక్ వంటి సేవలు ఉచితంగా పొందవచ్చునని అన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని గార మండల కేంద్రానికి చెందిన పొట్నూరు నవీన్ పాన్‌షాపు నడుపుకుని కుటుంబాన్ని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా వైద్యులు కేన్సర్ అని నిర్ధారించారు. వారి ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే. మెరుగైన వైద్యం పొందడానికి రూ.3 లక్షల వరకు అవసరమని వైద్యులు చెప్పారు. ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి లేదని బాధితుడు నవీన్ తన స్నేహితుల వద్ద మొరపెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవినాష్, శేఖర్, కోటి చరణ్ పాల్గొన్నారు.

సోంపేట : సోంపేట పట్టణానికి చెందిన నల్ల చిరంజీవి తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తరుణంలో అనుకోకుండా కేన్సర్ బారిన పడ్డాడు. నిరుపేద కుటుంబం అయినప్పటికీ చిరంజీవి తల్లిదండ్రులు అప్పులు చేసి తమ కుమారుడికి చికిత్స చేయించడం జరిగింది. అయితే ప్రస్తుతం అతడికి కీమో థెరపీ చేయించాలని వైద్యులు చెప్పగా... దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు స్పందించి, దాతలు సహకారంతో రూ.10,500 తక్షణ ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పలాస : కాశీబుగ్గ తాళ్లభద్రకు చెందిన బద్రి గోవింద్ ఈ నెల 30న గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు, బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు వద్ద ప్రొక్లెయినర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆకాల మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబానికి ఆదుకోవాలని ఉద్దేశంతో తన సొంత నిధులు రూ.లక్ష చెక్కును మృతుని తల్లిదండ్రులు రామయ్య, రాజులమ్మ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ఎప్పుడూ ఏ ఆపద వచ్చినా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అంతక ముందు బద్రి గోవింద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, దడియాల నర్సింహులు, వంకల కూర్మారావు, పాపారావు, బి.గోపాల్ పాల్గొన్నారు.

సోంపేట : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలాస : చెక్కును అందజేస్తున్న ఢిల్లీరావు

మాట్లాడుతున్న నాగరాజు

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నాయీ బ్రాహ్మణ సంఘ నగర అధ్యక్షులు కుప్పిలి నాగరాజు తెలిపారు. నగరంలోని కంపోస్టు కాలనీలోని ఓ భవనంలో నాయీబ్రాహ్మణ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల్లో నాయీబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందన్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. గతంలో సిఎం చంద్రబాబు ఆదరణ పథకం ద్వారా తమకు లోన్లు, పరికరాలు అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. అదే తరహాలో కూటమి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. సంఘ ఉపాధ్యక్షులు కుప్పిలి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోరింట శ్రీనివాసరావు, సహాయ అధ్యక్షులు కొవ్వూరు కృష్ణారావు, సహాయ కార్యదర్శి లక్ష్మణరావు, కోశాధికారి పంచగట్ల సురేష్ పాల్గొన్నారు.

ప్రపంచ కళాజాతరకు దుర్దశ నాటిక ఎంపిక

ప్రజాశక్తి- పలాస

కుమార్ నాయక్

ఈ నెల 19న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల వెంకన్న కళా ప్రాంగణములో జరుగు ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు దుర్దశ ఒడియా నాటికను ఎంపిక చేశారని నటుడు, డాక్టర్ కుమార్ నాయక్ తెలిపారు. ఐఎస్ఒ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ప్రధాన కార్యదర్శి టి. పార్థసారథి, కమిటీ నుంచి తనకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. డాక్టర్ తిరుపతి సాహూ రచన, దర్శకత్వంలో, ఒడియా కళాకార్ మహాసంగ్ కళాకారులు సురేష్ పాణిగ్రహి, కుర గౌడ, కుమార్ నాయక్, రమేష్ చంద్ర, జె.బి.సామంత, కుమిలిని ప్రధాన్, ప్రధాన పాత్రలు పోషిస్తున్నారని తెలిపారు.

పరామర్శిస్తున్న తిలక్

తిలక్ పరామర్శ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ గొల్ల వీధి చెందిన బర్ల కార్తీక్ తండ్రి బర్ల గోవిందరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పేరాడ తిలక్ మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం, నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు శంకరరావు, ఎన్.సోమేష్ ఉన్నారు.

బాబూరావుకు సన్మానం

పలాస : ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు స్వగృహంలో పలాస-కాశీబుగ్గ వైద్యులు సిహెచ్.సుధీర్, కూన పవన్‌కుమార్, రామ నరేష్, మెట్ట లక్ష్మీనారాయణ మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఎంపికపై భినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌టిసి ఎన్‌జెడ్‌ఎం యూనియన్ కూడా సన్మానించి అభినందించారు.

సన్మానిస్తున్న వైద్యాధికారులు

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

ఎచ్చెర్ల : మాట్లాడుతున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పంచాయతీ పరిపాలన కార్యకలాపాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని ఎపిఎస్ఐఆర్‌డి సహాయ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలుగ పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఆర్‌సి డిటిఎం ఎస్.లోకనాథ్, ఎంపిడిఒ హరిహరరావు, ఎఒ రామ్మోహనరావు, సీనియర్ సహాయకులు నారాయణరావు పాల్గొన్నారు.

పాతపట్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. పంచాయతీ విధి విధానాలపై రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, మండల పరిషత్ సూపరిండెంట్ తిరుపతిరావు పట్నాయక్, ఇఒపిఆర్‌డి వెంకటరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపిడిఒ రోణంకి వెంకటరావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రోణంకి వెంకటరావు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాలతో మరింత అవగాహన పెరిగి పంచాయతీ నిర్వహణలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని తెలిపారు. పంచాయతీల అభివద్ధిలో పాలకులు అధికారులు కలసి తమదైన ముద్ర వేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి అన్నెపు గోపాలరావు, పరిపాలన అధికారి ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

పాతపట్నం : శిక్షణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల ప్రణాళిక శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఎంపిడిఒ ఎం.పావని ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వంద రోజుల ప్రణాళిక శిక్షణకు ఉపసర్పంచ్ ఇద్దరు, వార్డు సభ్యులు హాజరయ్యారు. కాగా, గ్రామాల్లో వంద రోజుల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు నిర్వహణ వివిధ అంశంలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.రామారావు, ఎం.బి.వి.ప్రసాద్, మండల కో-ఆర్డినేటర్ నందివాడ రమణబాబు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పట్టుబడిన ఇసుక టిప్పర్

పోలాకి: మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రిప్పర్ పట్టుబడిందని ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. ఈ మేరకు స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని జొన్నాం కూడలి వద్ద తనిఖీ చేస్తుండగా... అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రిప్పర్ పట్టుబడిందన్నారు. ట్రిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

పొందూరు: మండలంలోని కృష్ణాపురం సమీపంలో సోమవారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ముందుస్తు సమాచారం మేరకు పేకాడ శిబిరంపై దాడిచేయగా, జూదం ఆడుతున్న గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన తొమ్మిది మందిని పట్టుకుని అరెస్టు చేశారు. వీరి వద్ద గల సుమారు రూ.1,06,800తో పాటు 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

కొబ్బరి మొక్కల పంపిణీకి చర్యలు

మాట్లాడుతున్న మాధవి, చలపతిరావు

బూర్జ : రైతులకు నవంబరు నెలలో పదివేల కొబ్బరి మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వైఎస్‌ఆర్ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ మాధవి తెలిపారు. మండలంలోని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలను పరిశోధనా కేంద్రం ద్వారా ఒక్కో మొక్క రూ.వంద చొప్పున రైతులకు విక్రయిస్తామన్నారు. కొబ్బరిలో వచ్చే తెగుళ్లు, పెంచడంలో వచ్చే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొబ్బరిలో వచ్చే తెగుళ్లు, పురుగులను నివారించడానికి అక్కడి ల్యాబ్‌లో జీవ నియంత్రణ కారకాలను ఉత్పత్తి చేసే పద్ధతులను వివరించారు. ఆయిల్‌పాం, నర్సరీ, రెక్కల చిక్కుడు వంటి వంగడాలనూ పరిశోధన చేస్తామన్నారు. నూతన వంగడాలు తయారు చేయడానికి ప్రభుత్వం కొంత బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం యూనివర్సిటీ ఆర్థికసాయంతో కొత్త వంగడాలను పరిశోధన చేస్తామన్నారు. సంప్రదాయ పంటలకు తోడు ఆధునిక పంటలు సాగుచేసే ఔత్సాహి క రైతులు పలువురు ఉన్నారని అన్నారు. ఉద్యానపంట ద్వారా రైతులకు కొత్తరకల వంగడాలను తయారు చేస్తానని పేర్కొన్నారు. పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు, నూనె గింజలు, చెరకు, పత్తి, మొక్కజొన్న, పూలు, పళ్లు, కూరగాయలు, దినుసులు, ఔషధ గుణాల మొక్కల విత్తనాలు ఇలా పలురకాల నూతన వంగడాలపై పరిశోధన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉద్యాన పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త ఎం.వి.వి. చలపతిరావు, నవ్యతేజ, మనోహర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పర్మినెంట్, అవుట్ సోర్సింగ్, ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కమిషనర్ ప్రసాదరావును మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు సమయానికి ఇంక్రిమెంట్స్, సరెండరు లీవులు ఇవ్వాలన్నారు. పెరిగిన నగర విస్తీర్ణం ప్రాతిపదికన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచి కార్మికులకు పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతిరావు, అప్పలరాజు, గురుమూర్తి, ఎన్.పార్థసారథి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

జీతాలు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి- పలాస

నూతనంగా ఏర్పాటైన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిలో గతేడాది నుంచి జీతాలు చెల్లించడం లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిగా జీతాలు లేక ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతూ విధులకు హాజరవుతున్నామని వాపోయారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

శ్రమదానం చేస్తున్న యువకులు

యువకుల శ్రమదానం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని దానగోర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవర జగన్నాయకులు ఆధ్వర్యాన నాయకులు సవర సోమేశ్వరరావు, సవర లక్ష్మణ్‌లు యువకులతో కలిసి మంగళవారం శ్రమదానం చేశారు. ప్రధాన రోడ్లు, వీధుల్లో రోడ్లను శుభ్రపరిచారు. అలాగే రోడ్డుకిరువైపులా జంగిల్ క్లీన్ చేశారు. కార్యక్రమంలో సవర సుచిత్ర, సవర వందన, సవర సంపత్, సవర కరుణాకర్, సవర సంజీవ్, సవర ఆనందరావు, సవర ప్రేమకుమార్, సవర ప్రసాద్, సవర చిరంజీవి, సవర జాన్ పాల్గొన్నారు.

15, 16న వ్యాసరచన పోటీలు

టెక్కలి : సత్యసాయి జన్మదిన వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 15, 16 తేదీల్లో సేవా సమితి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు విద్యార్థులకు టెక్కలిశాఖ ఆర్గనైజింగ్ కన్వీనర్ మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐఐటి చదువుతున్న విద్యార్థులు పాల్గొవాలన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే దిగుబడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

యాజమాన్య పద్ధతులతోనే పంట దిగుబడి సాధించవచ్చునని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్థిక పరిమిత స్థాయి దాటితేనే మందులు పిచికారీ చేయాలన్నారు. పొలం పరిశీలనలో భాగంగా కుళ్లు తెగులును గుర్తించి పలు సూచనలు చేశారు. ఈ పంట ఇకెవైసి ఈనెల 9 వరకు మాత్రమే సమయం ఉందని, రైతులు ఇకెవైసిని చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో మండపల్లి, కీర్తిపురం గ్రామాల్లో ఎఒ భార్గవి పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో వ్యాపించే పురుగులు, తెగుళ్ల నివారణా చర్యలపై అవగాహన కల్పించారు.

మెళియాపుట్టి : మండలంలోని జాడుపల్లి, పట్టుపురం గ్రామాల్లో మండల ఎఒ దానకర్ణుడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పలాస వ్యవసాయ శాఖ ఎడి, మండల స్పెషల్ ఆఫీసర్ లింగాల వెంకట మధుబాబు ముందుగా రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ఎస్.వెంకటరావు, పైడి రాజు, వ్యవసాయ సహాయకులు ఈశ్వరి, జయలక్ష్మి, సూర్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న ఎఒ భార్గవి

కవిటి: పొట్టదశలో రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని కవిటి, కొజ్జిరియా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు, బెందాళం తిరుమల, పొందూరు బాలకృష్ణ, జి.గణపతి, గిరిబాబు, ఉమాపతి, ఎంపిఇఒ లలితకుమారి, లోహిత్, కళ్యాణి పాల్గొన్నారు.

నందిగాం : ఖరీఫ్ వరి పైరులో సస్యరణతో పాటు యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే అధిక దిగుబడిని సాధించవచ్చునని మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని శివరాంపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బి జానకిరాం అధ్యక్షతన నిర్వహించారు.

పాతపట్నం: మండలంలోని కొరసవాడ, బోరుభద్ర గ్రామాల్లో మండల ఎఒ బి.రవికుమార్ ఆధ్వర్యాన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సవిరిగాన శ్రీనివాసరావు, వ్యవసాయ శాస్త్రవేత్త ఉదయ్‌బాబు, వ్యవసాయ సహాయ అధికారి, ఎ.శారద, విఎఎలు కలమట భుజంగరావు, కె.వి.రమణ, ఎ.సన్యాసి, ఎం.అప్పలనాయుడు, బోను లోకేష్, ఎం.పాపారావు, ఎస్.భాస్కరరావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.